# బంద్

**డి.ఆర్. ఇంద్ర**



రోజూ బారెడు పొద్దెక్కితేగాని లేవని వెంకటరమణ తెల్లారగట్ల నాలుగ్గంటలకే లేచికూర్చున్నాడు. ఈసారైనా పదో తరగతి ఇంగ్లీషు పరీక్ష పాసవుతానా లేదా అనే ఆందోళనతో రాత్రంతా నిద్రలేదు. ఈ ఒక్క ఇంగ్లీషు పరీక్ష తన పాలిట భూతమై పదవ తరగతి పూర్తి కానివ్వడం లేదు. తండ్రి ప్రభుత్వ సారా తాగితాగి గుండాగి అర్థాంతరంగా మరణించడంతో కుటుంబ భారం తన నెత్తిన పడింది. తాగి చచ్చేవాళ్లది కాదు బాధ, చావలేని నేరానికి బ్రతికున్నవాళ్లది బాధ! తను పదవ తరగతి పాసయితేనే తప్ప తండ్రి చేసిన రికార్డు అసిస్టెంట్ ఉద్యోగమైనా తనకు దక్కదు. ఉద్యోగానికి టెన్త్ పరీక్షకీ లంకె! ఇప్పటికి రెండుసార్లు రెండు మార్కుల తేడాతో పరీక్ష తప్పాడు. ఈసారి ఆ రెండు మార్కులూ రాకపోవా.... అని వెంకటరమణ ఆశ!

ఏడు గంటల వరకు ఇంగ్లీషు గైడు మరోసారి బట్టీపట్టాడు, తర్వాత పరీక్షకు బయల్దేరడానికి తయారైపోయాడు, పరీక్ష పదకొండు గంటలకే అయినా పరీక్ష రాయడానికి పాతిక మైళ్ల దూరంలో ఉన్న టౌన్‌కెళ్లాలి. బస్సెక్కితే గంటన్నర ప్రయాణం. చద్దన్నంతిని, కొత్తబాల్‌పెన్నూ, హాల్ టిక్కెట్టూ జేబులో పెట్టుకుని, విఘ్నేశ్వరుడూ, ఆంజనేయ స్వామి పటాలకి పదేసి సార్లు దణ్ణాలు పెట్టి బయల్దేరబోతుండగా వార్త తెలిసింది. అదేమంటే ఆ రోజు జిల్లా అంతా బంద్ అనీ బస్సులు డిపోల్లోంచి బయటికే తియ్యడం లేదనీ, వెంకటరమణ గుండెల్లో రాయిపడింది. నీరసం వచ్చేసింది. ఈసారి పరీక్ష రాసి పాసవకపోతే తనకు వచ్చే ఉద్యోగ అవకాశం శాశ్వతంగా పోతుంది. తర్వాత తన కుటుంబం అడుక్కుతినాలి. ఆర్టీసీ బస్సుల్లేకపోతే ఏం? ఏ లారీయో, వాన్‌నో దొరక్కపోదు. ఎలాగైనా తను పరీక్షా కేంద్రానికి సకాలానికి చేరాలి. 'జాగ్రత్త నాయనా' అని తల్లి కన్నీళ్లతో, ఆందోళనతో వీడ్కోలు ఇస్తోంటే వెంకటరమణ బయల్దేరాడు.

బంద్ వల్ల బస్సులు తిరగకపోవడంతో ప్రయాణాలు మానుకోలేని వాళ్లు ఏ లారీనో పట్టుకొని అడిగినంతా ఇచ్చుకుని పోతున్నారు. గంట అసహనంగా నిరీక్షించాకా ఓ లారీ వచ్చి మరొక ఇద్దరితో బాటు అందులో ఎక్కికూర్చుని ఊపిరి పీల్చుకున్నాడు వెంకటరమణ. ఇంక భయం లేదు. పరీక్ష రాసినట్టే, కాబిన్లో మరో ఇద్దరున్నారు. డ్రైవర్‌కాక జిల్లా బంద్ గురించే వాళ్లు మాట్లాడుకుంటున్నారు. బంద్ ఎందుకు జరుగుతుందో వెంకటరమణకి తెలుసుకోవాలనిపించింది. వాళ్ల సంభాషణ జాగ్రత్తగా వినసాగాడు. పట్నంలోని శాసనసభ్యుడు ప్రభుత్వ ఆఫీసుల్లో తాండవిస్తున్న అవినీతిని అరికట్టాలని ఆమరణ నిరాహారక్ష చేస్తూ తన అనుచరులతో జిల్లా అంతా బంద్ చేయిస్తున్నాడట!


"ఆఫీసుల్లో అవినీతి ఈ రోజు కొత్తగా వచ్చిందని ఆ శాసనసభ్యుడికి ఇప్పుడే తెలిసిందా పాపం? ఈ రాజకీయంగాళ్ల చలవ వల్ల గాదూ దేశమంతా లంచగొండిమయమైంది?" ఒక ప్రయాణీకుడు అసహనంగా వెటకరించాడు. "ఎవరో ఒకరు ప్రక్షాళనకి పూనుకోకోపోతే అవినీతి ఎక్కడిదక్కడే ఉంటుంది. ఏ గవర్నమెంటాఫీసుకి తమరెప్పుడు వెళ్లలేదు కాబోలు. వాళ్లు ఉద్యోగస్తులా లేక జలగలా? జలగలైతే కొంచెం రక్తాన్నే పీలుస్తాయి. ఈ అవినీతి జలగలు ప్రజల ప్రాణాలతో చెర్లాటలాడుతూ బతుకునే అపహాస్యం చేస్తారు. వీళ్ల ఆటకట్టించడానికి ఆమరణ నిరాహార దీక్ష చెయ్యాల్సిందే" ఆ శాసనసభ్యుడు సానుభూతిపరుడు కాబోలు మరొకతను ఉద్రేకంగా అన్నాడు.

"అలాగా....! ప్రజలను ఉద్యోగస్తుల అవినీతి నుండి రక్షించాలనే ప్రజాప్రేమే నిజమైతే మరి ఈ బలవంతపు బంద్‌లు నెత్తిన రుద్ది అదే ప్రజలను హింసించడం మాటేమిటి? బంద్ వల్ల ప్రజాజీవితం ఎంత అస్థవ్యస్థమౌతుందీ ఆలోచించరే? పీకల మీదకొచ్చే అర్జంటు పనుల మీద ఎక్కడెక్కడికో వెళ్లే వేలాది మంది ప్రయణీకుల పాట్లు గురించి ఏం చెబుతారు? రెక్కాడితే గాని డొక్కాడని వాళ్లు బలవంతపు బంద్ వల్ల పని లేక ఆకలికి మాడవలసిందేనా? ఒక్క రోజు ఆఫీసులూ, యంత్రాలూ, వ్యాపారాలు స్తంభిస్తే ఎన్ని కోట్లు నష్టమో ఆలోచించరేం? ఇంతకీ బంద్‌కి అసలు కారణం తెలుసా మీకు? ఆ ప్రజాప్రతినిధిగారి పని ఆఫీసువాళ్లు అగ్గగ్గలాడుతూ వెంటనే చేయలేదట. అందుకని ప్రజాప్రతినిధిగారి అహం తన్నుకొచ్చి అవినీతి ప్రక్షాళన వంకతో ఆ ఉద్యోగస్తులను ఉద్యోగాల్లోంచి డిస్మిస్ చేయాలని డిమాండ్‌ట! అది ఆయనగారి వ్యక్తిగత విషయం. దానికి మసిపూసి మారేడుకాయ చేసి లేని సమస్యని సృష్టించి, గొడవ చేసి నలుగురి దృష్టి ఆకర్షించి నాయకుడిగా ఎదిగి వచ్చే ఎలక్షన్లలో పార్టీ సీటునీ, గొర్రెల్లాటి అమాయకుల ఓట్లనీ దండుకోవాలనీ అసలు ఎత్తు తెలుసా....?" తన విశ్లేషణాశక్తికి తనే మురిసిపోతూ ఎంతో గర్వంగా ఊపిరిపీల్చుకున్నాడు మొదటి వ్యక్తి.

శ్రద్ధగా వింటున్న వెంకటరమణకి అతను చెప్పింది నిజమే అనిపించింది. లేకపోతే చీటికీ మాటికీ ఈ బంద్‌లు ఏవిటి? బంద్‌లు జరక్కుండా, ప్రజాజీవితం సాఫీగా జరిగేలా చూడాల్సిన బాధ్యత నెత్తిన ఉన్న ప్రభుత్వం బస్సులు తిప్పడం మానేసి ప్రజల్ని ఇరకాటంలో పెట్టడం ఏమిటి? లక్షల మంది సాయుధ పోలీసులకి కోట్ల కొద్దీ జీతాలిచ్చే ప్రభుత్వం గుప్పెడు మంది గుండాల నుంచి ప్రభుత్వ బస్సుల్నే రక్షించుకోలేదా? ఆఫీసుల్ని, ఫ్యాక్టరీలని, వ్యాపారాన్ని దౌర్జన్యంగా కొన్ని డజన్ల మంది రౌడీలు మూయించేస్తుంటే ప్రభుత్వం రక్షణ ఇవ్వలేదా? బంద్ చేయిస్తూన్న వీళ్లి అదుపులోకి తీసుకోడానికి బదులు —అలకపాను పెక్కిన పెళ్లి కొడుకుని బతిమాలినట్టు కలెక్టర్లు, ఎస్పీలు, తోడు దొంగలైన ఇతర ప్రజాప్రతినిధులు కలిసి నిరాహార దీక్షకు కూర్చున్న బంద్ విరాట్టుల్ని బ్రతిమాలడం, హామీలివ్వడం —ఇదంతా వినడానికీ, చూడ్డానికీ, భరిం

చడానికీ, పరమ జుగుప్సాకరంగా ఉందే....! వెంకటరమణ ఆలోచనలు డ్రైవర్ మాటలతో చెల్లాచెదురయ్యాయి.

"నిజం చెప్పావ్ గురూ. నాయకులంతా గూండానాకొడుకులే. ఇయన్నీ ఓట్ల కోసం వేసే స్టంటులు గురూ. ఎక్కడ బంద్ జరిగినా ఆర్టీసీ బస్సులూ, మా లారీలేగా ముందు తగులడేవి. క్రితం సారి గవర్నమెంటోళ్లే దగ్గరుండి చేయించిన బంద్‌లో నా లారీని తగలెట్టారు. కుక్కల్నా కొడుకులు. యెదవల్ని యెత్తి ఆ మండే లారీ మీదకు విసిరేద్దామని




పించింది. ఒక్కణ్ణైపోయాను కానీ. ఈళ్లకే మళ్లా ఓట్లు గుద్ది మమ్మల్ని సావదొబ్బండ్రా! ' అని గెలిపించాలా? థూ....! ఈసారెవడికైనా ఓటేస్తే సెప్పిచ్చుకొట్టండి...." అంటూ కసిగా ఏక్సిలరేటర్ తొక్కబోయి రోడ్డుకడ్డంగా ఎదురుగా నిలబడ్డ వాళ్లని చూసి బూతులు లంకించుకున్నాడు. తాను కొద్ది నిముషాల్లో సమీపిస్తుందనగా నిర్మానుష్యంగా ఉన్న ఆ రోడ్డు మీద సడెన్‌గా బడితెలు, ఇనప చెయిన్లతో నిలబడ్డ ఆ దౌర్జన్యకారుల గుంపుని చూడగానే లారీలో ఉన్న వాళ్ల ప్రాణాలు భయంతో గడ్డకట్టేశాయి. చెయిన్లతో నిలబడ్డ ఆ దౌర్జన్యకారుల గుంపుని చూడగానే లారీలో ఉన్న వాళ్ల ప్రాణాలు భయంతో గడ్డకట్టేశాయి.

లారీ ఆపుతారా బలవంతంగా? ఆపి తగలబెట్టేస్తారా? తమకేమి ప్రమాదం జరగదు కదా? వెంకటరమణ ఎరువు తెచ్చి చేతికి పెట్టుకున్న వాచీవంక చూశాడు. పరీక్ష కేంద్రానికి తనకి ఇంక కేవలం అరగంట మాత్రమే టైముంది. పరీక్షకి ఆటంకం ఏమీ రాకుండా ఉండాలని మళ్లీ విఘ్నేశ్వరుడ్నీ, ఆంజనేయస్వామినీ తలుచుకున్నాడు. వెంకటరమణ ఊహించినట్లు లారీ ఆగలేదు.

"కుక్కల్నాకొడుకులు...! వీళ్లకి దొరుకుతానా?" అని పళ్లు పటపటకొరుకుతూ డ్రైవర్ స్పీడు తగ్గించకుండానే గుంపుకి బాగా దగ్గరగా వచ్చిన తరువాత ఎవరూ ఊహించని విధంగా రోడ్డుపై నుంచి పక్కకు తప్పించాడు. ఆ ప్రయత్నంలో రోడ్డు పక్కన ఉన్న పెద్ద గోతిని గమనించలేదు.

వెంకటరమణ ప్రార్థనలు విఘ్నగణాధిపతికి అందనేలేదు. గోతిలో తలక్రిందులైన లారీలోని మనుషులకి మూలిగే సందూ, అవకాశమూ కూడా లభించలేదు. వెంకటరమణ జేబులోని హాల్ టిక్కెట్ చీలిపోయిన అతని గుండె రక్తంతో తడిసి మందార పుష్పమైంది.

.........

ఇరవయ్యేడేళ్ల సారథి చాలా కాలంగా గడ్డం గియ్యడం లేదు. అతని భార్య కడుపుతో లేదు. అతనికసలు పెళ్లేకాలేదు. ఈవేళ గెడ్డం గీసి ట్రిమ్‌గా తయారయ్యాడంటే ఈ రోజు ఫస్టుక్లాసు ఎమ్మే డిగ్రీ దుమ్ముదులిపి ఇంటర్వ్యూకు హాజరవబోతున్నాడన్నమాట. నిన్నరాత్రే అనుకున్నాడు ఉద్యోగానికిదే ఆఖరి ప్రయత్నమని, ఆరేళ్ల క్రితం —ఫస్ట్ క్లాస్ ఎమ్మే డిగ్రీ తనను రీసెర్చి చెయ్యమనీ, ప్రొఫెసర్ అవ్వమనీ ప్రోత్సహిస్తే రిటైర్మెంటు దగ్గర పడ్డ తండ్రీ, గిన్నిస్ రికార్డు కోసం దగ్గుతోందా అనేటట్టు ఎల్లప్పుడూ దగ్గే తల్లీ, పాతికేళ్లు వయసు వచ్చి ముదిరిపోతూన్న పెళ్లి కాని అప్పగారు, అదే లైన్లో ఉన్న చెల్లీ ఇంక చదువుకు స్వస్తి చెప్పి కుటుంబ బాధ్య.త నెత్తిన వేసుకుని పితృరుణం, మాతృరుణం తీర్చుకొమ్మని ఇన్‌డైరెక్టుగా చెప్పే దాకా తనని వెదుక్కొంటూ రాబోయే గెజిటెడ్ ఉద్యోగాల గురించి రంగుల పగటికలలు కంటూనే ఉన్నాడు. మంచి ఉద్యోగం తనకాళ్ల దగ్గరకే తన్నుకొస్తుందనే అమాయకపు అహంకారం, ఉత్తర దక్షిణాలతో జాబ్ సంపాదించడం నీచమనుకునే ఆదర్శం వంటి మీద నుండి రాలేసరికి అర్థపుష్కరం పట్టి, ఎంత చిన్న ఉద్యోగం చెయ్యడానికైనా సరే రెడీ అనుకునే సరికి ఆ చిట్టీ పొట్టీ ఉద్యోగాలూ కూడా అందకుండా చిటారుకొమ్మెక్కి కూర్చున్నాయి.

నెలక్రితం పేపర్లో చదివాడు — ఎమ్మే.పి.హెచ్.డి. చేసి ఒక దశాబ్దం ఉద్యోగాలకి ప్రయత్నంచేసి విఫలమై చివరికి — తనతో ఇంటర్‌దాకా చదివి మానేసి రాజకీయాల్లో చేరి మంత్రి అయిన స్నేహితుడి దగ్గర కారు డ్రైవర్‌గా చేరిన వ్యక్తి ఉదంతం. అది చూసాక అనుకున్నాడు —ఇంక చివరి సారిగా ఒకే ఒక్క ప్రయత్నంచేసి , ఫలించకపోతే ఏదో హోటల్లో సర్వర్‌గా చేరాలని ! ఉత్తర దక్షిణాలతో ఉద్యోగం సంపాదించకూడదనే తన ఆదర్శానికి తిలోదకాలిచ్చి, అహం చంపుకుని, తండ్రి వెంట వెళ్ళి ఎవరి కాళ్ళో పట్టుకుని ఉత్తరం సంపాదించి, తల

తాకట్టుపెట్టి అప్పుచేసి దక్షిణం కూడా రెడీ చేసుకుని నైట్ వాచ్‌మెన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి తయారయ్యాడు.

తల్లి ఆశగా దగ్గుతూ ఆశీర్వదించింది. చెల్లి నిరాశని తొక్కిపట్టి రాని నవ్వుని ముఖంపై పులుముకుని శకునం ఎదురొచ్చింది. సారథి గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు. ఉత్తర దక్షిణాలు రెండూ జేబులో ఉన్నాయి కాబట్టి ఈసారి ఇంటర్వ్యూ నామమాత్రమే, విజయలక్ష్మి తనదే ... విజయ... ! తన ప్రేయసి విజయ తనకు మంచి ఉద్యోగం వస్తుందని నాలుగేళ్ళు ఎదురుచూసి చూసి, చివరికి చెప్పాపెట్టకుండా ఎవర్నో చేసేసుకుంది. పోతే పోనీ విజయకాకపోతే మరో జయ ... ఉద్యోగం రాగానే ... అప్పు తీర్చేసి, అక్కా, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసేసి ... అమ్మ దగ్గు రోగం కుదిర్చేసే... సే... సి... ? హేమిటది ... ఇంటర్వ్యూ జరగాల్సిన ఆఫీసు దగ్గర గుంపు ... గొడవ ...?

గుంపు చేతుల్లో బడితెలు, సైకిలు చైన్లు .... ! జీపులో మైకు పెట్టి —ఆఫీసులు, దుకాణాలు మూసెయ్యమనీ, లేకపోతే జరిగే విధ్వంసానికి తమ బాధ్యత ఉండదనీ; అవినీతి నిర్మూలనకి కంకణం కట్టుకున్న తమ ప్రియతమ ప్రజాప్రతినిధికి మద్దతుగా బంద్ విధిగా పాటించితీరాలనీ బండబూతులు నిండిన కఠినస్వరంతో అరుస్తున్నారు ...? రోడ్‌మీద ఒక్క రక్షకభటుడూ కన్పించరేం ....!

ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళు ఇప్పటికే ఆఫీసులోపల ఉన్నారు కాబోలు. తనేలేటు !

తను లోపలికి వెళ్ళలేకపోతే ... ఈ జన్మకి ఉద్యోగంపై ఆశవదులుకోవల్సిందే. ఎలాగో అలా వీళ్ళని బతిమాలి ఆఫీసులోపలికి అడుగుపెడితే చాలు ... "ప్లీజ్ బ్రదర్ ...! ఈవాళ ఇక్కడ నాకు ఇంటర్వ్యూ ఉంది ... యూ... సీ..."

"బ్రదరా ... ? ఎవడ్రా బ్రదరూ ? నా బాబు ఉంచుకున్నదానికి పుట్టావేటిరా కజినూ ... ? ఉద్యోగం కావాలిట బ్రదరుకి ! ఇంటర్వ్యూ ఇక్కడే చేసెయ్యండిరా వీడికి .. బంద్ అంటే వేళాకోళం అనుకుంటున్నారు పిచ్చినాయాళ్ళు ..." నాలుగు బడితెలు, నాలుగు చైన్లు గాల్లోకి లేచాయి.

తలపగిలి నెత్తురుముఖంపై కళ్ళమీదుగా కారుతుంటే —"ఉద్యోగుల అవినీతి జులుం నశించాలీ; ప్రియతమ నాయకుడూ ... వర్ధిల్లాలీ" అని అరుచుకుంటూ దుమ్ము రేపుకుంటూ కనుమరుగవుతూన్న జీపుని చూస్తూ తలవాల్చాడు సారథి. జేబులోని దక్షిణం మాయమవగా మిగిలిపోయిన ఉత్తరం కొంచెం కొంచెం రక్తంతో తడిసి ఎర్రబారుతోంది.

సత్యవతి తన జీవితంలో అంత గాభరా




"నేను నటించిన సినిమాల్లో, ఎక్స్‌పోజింగ్ మరీ ఎక్కువైందంటారా?" అని అడిగింది హీరోయిన్ విలేఖరితో. "ఈ ప్రశ్న సెన్సార్ వాళ్లను అడగండి! మేం చూడకుండా కట్ చేసింది. వాళ్లేగా?" అన్నాడు విలేఖరి.

ఎప్పుడూ అనుభవించలేదు. తనూ అరడజనుమంది పిల్లల్ని కన్నది గానీ ఇలా ...! నెప్పులు మొదలవడం ఏమిటి —నిమిషాల మీద జీవి భూమ్మీదపడేది. తనతరంవేరు. ఆ తిండీ, ఆ బలం, శ్రమా వేరు. ఇప్పుడిదేవిటి ... ? ఎరువులే తినడం ... తోటకూర కాడల్లా నీరసంగా వాలిపోవడం ...! తనకాలంలో ఇలా ఉత్తినే పొట్టలు చీరేసి బిడ్డని బయటకు లాగిపారెయ్యడం —పత్రావేలు అనడం ఉందా ? అంతా కాలమహిమ ! ఈ కాలపిల్లలకి నెప్పులు లేకుండా, తెలీకుండా సుఖంగా కనెయ్యాలని ఆశ ! డాక్టర్లకి డబ్బాశ ! తన మనవరాలు మొదటి ప్రసవానికే ఎంత హడావుడి చేస్తోంది ! పిచ్చిపిల్ల ! డాక్టరమ్మ ఇంకా వారంరోజులు టైముంది అంది. ఇపుడీపిల్ల వరస చూస్తే మరో గంటలో కనేట్టు మూల్గుతుంది. ఇంట్లో చూస్తే తనొక్కర్తె ఉంది టైముకి. పెళ్ళాన్ని అపురూపంగా చూసుకునే పిల్లమొగుడు —ఎట్టిపరిస్థితుల్లోనూ పురుడు ఇంటిదగ్గర పొయ్యద్దనీ, హాస్పటిల్లోనే జరగాలనీ చెప్పివెళ్ళాడు. ముందునుంచే హాస్పిటల్లో రోజుకు అనవసరంగా వందేసి రూపాయలు అద్దెకట్టడం ఊరుకుంది.

ఊరిచివర విసిరేసినట్టున్న తమ కాలనీ నుంచి కొంతదూరం నడిచి వెడితేనేకానీ మెయిన్‌రోడ్డు మీద వెళ్ళే రిక్షాకానీ, ఆటో కానీ దొరకవు. కడుపుదానికైతే చావు తంటా తనకొచ్చిపడింది ! ఏం చెయ్యడం ? ఆటో ఏదైనా తెమ్మని ఏ పొరుగింటి కుర్రాణ్ణో బ్రతిమాలాలి. ఆ పనేచేసింది. ఆ కుర్రాడు గోడక్కొట్టిన బంతిలా తిరిగొచ్చాడు చావుకబురుతో —ఆ రోజు వూరంతా బంద్ అనీ, వాహనాలేవీ తిరగవనీ, సత్యవతి పై ప్రాణాలు పైనేపోయాయి. ఏడెనిమిది కిలోమీటర్లు వెడితేగానీ నర్సింగ్‌హోమ్‌లు రావు. కంట తడిపెట్టడం ఎరగని ఆ వృద్ధురాలి కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. తనే పాపం చేసిందని ఈ శిక్ష ? ఈ పిల్ల సుఖప్రసవమై బిడ్డతో సుఖంగా తనింటికి చేరుతుందా ? ఎవరి కడుపూ, కాళ్ళు పట్టుకోవాలిపుడు ? ఇరుగూ పొరుగూ సానుభూతైతే చూపించగలిగారు కానీ సమస్యకి పరిష్కారం మాత్రం చెప్పలేకపోయారు —బంద్‌కి కారణమైన గూండాలనీ, ఆ గూండాల మహారాజపోషకులైన నాయకుల్నీ తిట్టుకోవడం తప్పించి.

క్షణాలు గడిచేకొద్దీ గుండెలవిసేలా పిల్ల అరుపులూ ఏడుపూ ఎక్కువయ్యాయి. సత్యవతిని నిస్సత్తువ ఆవహించింది. మరికొంత మంది ఆడవాళ్ళతో రోడ్డుమీద నిలబడి అరుదుగా వెడుతూన్న వాహనాల్ని ఆపడానికి ప్రయత్నించి విఫలమైంది. చివరికి టౌన్లోకి వెడుతూన్న రెండెడ్లబండి ఆసామీ ఒకడు కనికరించాడు. ఆ పిల్లని సాయంపట్టి బండిలోకి చేర్చారు. ఎడ్లబండి నత్తనడక సాగించింది. సత్యవతి ఏడుకొండలవాడికి మొక్కుకుంది ఏడుస్తూనే.

డబ్బెక్కువైన ఏడుకొండలవాడికి సత్యవతమ్మ డిబ్బీలో వేస్తానన్న సొమ్ము చేదైంది కాబోలు ! దారిలోనే శ్వాస ఆగిపోయిన మనవరాలిని చూసిన సత్యవతమ్మకి ఏడుపు రాలేదు. ఆ ముసలి ప్రాణిలో జీవవ్యాపారం బంద్ అయింది.

• • • • • • •

పార్వతమ్మకి ఉదయం లేస్తూనే చాలా ఆనందంగా ఉంది (నీరసంగా ఉన్నప్పటికీ) తనకి రాఘవతో పెళ్లై ఈ రోజుకు అరవై వసంతాలు నిండాయి. చిత్రంగా తమ పెళ్ళి రోజే రాఘవ పుట్టినరోజు కూడా. తనకి పెళ్ళినాటికి పదమూడేళ్ళయితే రాఘవకి పాతిక. రాఘవలాంటి మొగాడూ, మొగుడూ ఈ భూప్రపంచంలో మరొకరు ఉండరు. ఆ మాట చెప్పినా ఎవరూ నమ్మరు. అందుకే తను చెప్పదు. అసలెందుకు చెప్పాలి. అది కేవలం తమిద్దరికే చెందిన విషయం. నిజం తెలీని లోకం తనని గొడ్డుమోతు ఆడదంటుంది. తను నవ్వుకుంటుంది. తనకి రాఘవే ఒక పసి బిడ్డ. రాఘవకి తనే ఒక చంటి పిల్ల అనే సంగతెవరికి తెలుసు?

జిల్లా బోర్డు స్కూల్లో ఉపాధ్యాయుడుగా చేస్తున్న రాఘవ గాంధీ గారి సిద్ధాంతాలకు ఆకర్షితుడై ఉద్యోగానికి తిలోదకాలిచ్చి స్వాతంత్ర్యోద్యమంలోకి దూకాడు. అప్పుడు తను కొత్త పెళ్ళి కూతురు. ఇంకా పూర్తిగా ఎదగని తన చిగురాకులాంటి బక్క శరీరం మీద ఏడు గజాల చీరని మొయ్యలేక మోస్తూ తడబడుతున్న అడుగులతో రాఘవ జీవితంలోకి ప్రవేశించిన అమాయకపు వైవాహిక జీవితపు తొలి దినాలు. పచ్చని దబ్బపండులాంటి ఛాయతో ఆరడుగుల ఆజానుబాహువైన రాఘవని చూస్తే తన ఇష్టదైవమైన కోదండరాముడు ప్రత్యక్షమైనట్టనిపించినిలువెల్ల పులకించిపోయేది. కోటి మధుర శృంగారపు టూహల తలపులతో రాఘవ పరిష్వంగనం కోరిన తన కన్నె హృదయానికి లభించిన

దేమిటి? తన నుండి రాఘవ కోరినదేమిటో అర్థమైన తన గుండె వెయ్యి చెక్కలైంది. రాఘవ —తన కోదండరాముడు తను ప్రమాణం చేస్తూ తనచేతాప్రమాణం చేయించాడు. దేశమాత విదేశీ దాస్య శృంఖలాలలో విలపిస్తుండగా దేశభక్తుడనేవాడెవడూ కామ భోగాలనుభవించడం తుచ్ఛమని, భరత మాత స్వతంత్రరాలయ్యేదాకా కఠిన బ్రహ్మచర్యం ఆవలంబిస్తామని.

గాంధీగారి బ్రహ్మచర్య దీక్షతో ప్రభావితుడై బ్రహ్మచారిగానే మిగిలిపోయిన రాఘవతోబాటు తనూ కన్యగానే —వృద్ధకన్యగానే— లోకం దృష్టిలో గొడ్డుమోతుగానే మిగిలిపోయింది. ప్రియుడూ, భర్తా, దైవం అయిన తన రాఘవ పరిష్వంగం ఒక్కసారైనా లభించకపోయినా అతని అడుగుజాడల్లోనడుస్తూ స్వాతంత్ర్య పోరాటంలో తనూ లాఠీ దెబ్బలు రుచిచూస్తూ అతనితో సహజీవనమే తనకి దక్కిన పరమ భాగ్యం అనుకుంది. రాఘవ తన భర్త కావడం తన జీవితానికి ఒక శాపమో వరమో తనెన్నడూ తర్కించలేదు.

రాఘవ బ్రతికుంటే ఈపాటికి ఎనభయ్యేళ్ళుండేవి. స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీని బతక నిచ్చిందా దేశం. రాఘవలాంటి గాంధేయుల్ని మాత్రం బతకనివ్వడానికి? గాంధీని కాల్చి చంపితే —ఉద్యమం కోసం అన్నీ అందర్నీ వదులుకున్న రాఘవని —లాఠీదెబ్బలతో రాటుదేరి యవ్వనమంతా జైలుపాలు చేసిన రాఘవని ఆకలితో, దుర్భర మనోశోకంతో మాడ్చి చంపింది. స్వాతంత్ర్యోద్యమంతో సంబంధం లేని వాళ్ళూ, ఉద్యమానికి వ్యతిరేకంగా బ్రిటిష్ కుక్కలకి బానిసలుగా తోకాడించిన వాళ్ళూ ఆనాటికి అసలు పుట్టని కుర్రకుంకలూ స్వాతంత్ర్య సమరయోధులుగా తనకళ్ళెదుటే పెన్షన్లూ, ఇతర సౌకర్యాలూ పొందుతుంటే తనూ ఆ దొంగల లైనులో నిలబడి ఆ ముష్టి అందుకోవడానికి నిరాకరించి స్మగ్లర్లూ, హంతకులూ, నేరస్తులూ ప్రజాప్రతినిధులై, పాలకులై దేశాన్ని తాకట్టుబెడుతూ ప్రజాస్వామ్యం గొంతు నులుముతుంటే చూస్తూ ఏమీ చేయలేక విలపిస్తూ గుండెపగిలి తన ఒడిలోనే తుది శ్వాస వదిలాడు.

రాఘవలేని జీవితం అర్థవిహీనమనిపించి చద్దామనిపించింది. కానీ రాఘవ దృష్టిలో ఆత్మహత్య మహాపాపం. ఒంటరి ఆడది గౌరవంగా ఎలా జీవించాలి? పేదలకి, అనాధలకి చేతనైన సాయం చెయ్యాలనేదె రాఘవ తనకి నేర్పిన తొలి జీవిత పాఠం. అందుకే లాభాపేక్ష లేకుండా స్వల్పమైన రేటుకి పేదల కోసం చిన్న హోటల్ నడుపుతోంది అప్పటి నుండీ.పార్వతమ్మ హోటల్ అంటే పేదలకి అన్నపూర్ణ. డబ్బులివ్వలేనివాళ్ళని ఎప్పుడూ డబ్బులడగలేదు. పెద్ద మనుషులకంటే ఎక్కువ ఆత్మ గౌరవముండే పేదలెన్నడూ తన వితరణని ఉచితంగా వాడుకోనూలేదు. స్వాతంత్ర సమరయోధుడైన రాఘవ పుట్టినరోజున పేదలందరికీ అన్న సంతర్పణ చేస్తుంది. ఈ రోజు రాఘవ పుట్టిన రోజు. అన్న సంతర్పణ బాగా జరగాలి. తన ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే ఉంది. ఇంకెన్ని రోజులో బ్రతక్కపోవచ్చు.రాఘవని చేరే శుభ ఘడియకోసమే ఎదురు చూస్తోంది.



ఒక ఆగంతకుడి నుంచి బ్యాంకును పేల్చేస్తాం అని ఫోన్ వచ్చింది శంకరానికి.

'వెంటనే పేల్చివేయండి సార్' ఇక్కడ నేను లక్ష రూపాయలు తేడా వచ్చి బాధపడుతున్నాను'' అన్నాడు క్యాషియర్

భాస్కర భరద్వాజ్
కొమరిపాలెం

అప్పుడేవచ్చాడు తనంటే ప్రాణం పెట్టే రిక్షా నాగన్న. భయపడుతూనే చెప్పాడు బంద్ సంగతి. దుకాణాలు, హోటళ్ళూ, మందుల షాపులు కూడా దౌర్జన్యంగా మూయించేస్తున్నారనీ, అన్న సంతర్పణ కూడా హోటల్లో జరగనీయరేమోనని.

పార్వతమ్మ నవ్వింది. నేను స్వాతంత్ర్య సమర యోధుని భార్యనని మర్చిపోతున్నావ్ నాగన్నా. గుప్పెడు మంది గూండాలకి జడిసి లక్షల జనాభా ఉన్న ఊరు పిరికిదై తన కితాను బంద్‌కి బందీ ఐ చీమూ నెత్తురూ లేనితనాన్ని ప్రదర్శిస్తుందేమో కానీ, లాఠీ దెబ్బలు తిని, జైలు ఊచలు తెక్కపెట్టిన ఈ పార్వతమ్మ మాత్రం జడవదు. స్వాతంత్ర భారతమాత నా మొగుడ్ని హత్య చేసింది. తన దాశ్యశృంఖలాలు బద్దలు కొట్టి విడిపించినందుకు ఫలితంగా. స్వతంత్ర్య భారతి చేతుల్లో నన్ను కూడా హతమవనీ. వెళ్ళు. సంతర్పణ ఏర్పాట్లు చూడు...'' అంటుండగానే బంద్ నిర్వాహకుల మైకుల్లో బెదిరింపుల హోరు, వాహనాలు సమీపిస్తున్న చప్పుడూ దగ్గరైంది.

పార్వతమ్మ హోటల్ పక్కనే ఉన్న గాంధీ విగ్రహం సెంటర్లో జీపు, ఇతర వాహవాలూ ఆగాయి. బడితెలూ, చైన్లూ వాహవాలూ దిగాయి. మూసిన తలుపుల్లోంచి, కిటికీల్లోంచి వందల జతలకళ్ళు భయం భయంగా చూస్తున్నాయ్.

“ఏయ్ ముసలిముండా ! ఎంత ధైర్యమే నీకు హోటల్ తెరవడానికి? మూస్తావా,,, ఛస్తావా? !! మైకులోంచి వికృతమైన గొంతు కర్ణకఠోరంగా అరిచింది. అది విన్న పార్వతమ్మ చెవుల్లో రాఘవ తుది శ్వాసవిడుస్తూ సంవత్సరాల క్రితం అన్న మాటలు గింగురుమంటున్నాయి.

“స్వాతంత్ర సముపార్జన ఎంత ముఖ్యమో, స్వాతంత్ర్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. తండ్రులు జయించి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని బిడ్డలు రక్తమోడ్చి నిలబెట్టుకోవాలి. లేకపోతే ఏ స్వాతంత్ర్య పోరాటమూ తనకు తానుగా శాశ్వతమై పరిపూర్ణత పొందదు. స్వాతంత్ర్య పోరాటాన్ని తరువాత తరం వాళ్ళు కొనసాగించడమే పీడన తాడన కొత్తరూపంలో కొత్త నిరంకుశులద్వారా దురహంకారుల ద్వారా వచ్చి మన వాకిట ముందు నిలుస్తాయి. స్వేచ్ఛా వృక్షానికి మానవరక్తం ఎరువు కాక తప్పదు. స్వాతంత్ర్యానికి రక్తమే ప్రాణజలం....''

పార్వతమ్మ మాట్లాడకుండా పాకలోకి వెళ్ళి పొయ్యిలోంచి మండుతున్న కట్టె పట్టుకుని వచ్చి నిలబడింది. రండర్రా ! నా ప్రాణాలు తీసి నా హోటల్ బంద్ చేయించండి మొనగాళ్ళు...''

“ముసలి పీనుగు తెగ నీలుగుతోందే. దీని భరతం పట్టండర్రా.... '' ఆజ్ఞలు జారీ అయ్యాయి. బడితెలూ, చైన్లూ శిరసావహించాయి. అడ్డుకోబోయిన పార్వతమ్మను ఎత్తి గాంధీ విగ్రహం మీదకి విసిరేశారు. ఐదు నిముషాల్లో అక్కడో హోటల్ ఉండేదనే ఆనవాళ్ళు కూడా ధ్వంసం చేశారు. గాంధీ విగ్రహం మీదకి పార్వతమ్మ విసిరెయ్యబడింది. ఆ చప్పుడుకు విగ్రహం నెత్తిమీద కూర్చున్న కాకి గాంధీ గారి కళ్ళజోడు మీద రెట్టవేసి ఎగిరిపోయింది. జాతి (పిత) కళ్ళు మసకలు కమ్మాయి.

యుద్ధ విమానాల బాంబింగ్ తర్వాత కలుకుల్లోంచి బయటపడే జనాల్లాగ సాయంత్రం రేడియోలో బంద్ వార్తల కోసం గుంపులు గుంపులుగా చేరిన స్వాతంత్ర్య భారత పౌరులకోసం ఆకాశవాణి వార్తా ప్రసారం ప్రారంభమైంది.

“ఆ...కాశవాణి వార్తలు చదువుతున్నది ... సత్యమూర్తి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టాలని ఆమరణనిరాహారదీక్షకు పూనుకున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధి, అవినీతి పాలిటి యముడూ, యువజన నాయకుడూ అయిన శ్రీ బుచ్చిరెడ్డి నాయుడు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు మద్దతుగా సంపూర్ణ ప్రజానీకం జరిపిన జిల్లా బంద్ పూర్తిగా విజయవంతమైందనీ, బంద్ సందర్భంగా ఏ ఒక్క అవాంఛనీయ సంఘటనా జరగలేదనీ మా ఆకాశవాణి ప్రతినిధి తెలియజేస్తున్నారు....''